క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి



కె.కె.రాజు, అల్లు శంకరరావులను సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతున్న రవికుమార్

మురళీనగర్: వైఎస్సార్‌సీపీ 49వ వార్డు అధ్యక్షుడిగా అయినింటి రవికుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావులను కలిసి సత్కరించారు. తనకు ఈ పదవి కేటాయించిన రాష్ట్ర పెద్దలకు, వార్డు అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన కె.కె.రాజు, అల్లు శంకరరావులకు రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కె.కె.రాజుకు కృతజ్ఞతలు



పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రామ్మోహన్

మురళీనగర్: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా 50వ వార్డుకు చెందిన పాతపట్నం రామ్మోహన్ నియమితుడయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో రామ్మోహన్‌ను ఈ పదవిని కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కె.కె.రాజును పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రాంబాబు, ఎస్.రమేష్, కె.పార్థసారథి, ఎస్.నారాయణస్వామి పాల్గొన్నారు.

కొండవాలులో పర్యటించండి



కె.కె.రాజుకు మొక్క అందజేస్తున్న 47వ వార్డు అధ్యక్షుడు కుందిరి సుకుమార్

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ 47వ వార్డు అధ్యక్షుడిగా నియామకమైన కంచరపాలేనికి చెందిన కుందిరి సుకుమార్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులోని కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కె.కె.రాజుకు వివరించారు. వీటి పరిష్కారానికి వార్డులో పర్యటించాలని ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వార్డు అధ్యక్ష పదవి నియామకానికి సహకరించిన కె.కె.రాజుకు సుకుమార్ శాలువా కప్పి, పూల మొక్క బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీని వార్డులో మరింత బలోపేతం చేస్తానన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు ఊరట

అల్లిపురం: జీవీఎంసీ సర్వే నంబర్ 7 రేసపువానిపాలెంలో అక్రమ నిర్మాణాలకు అనుమతించినట్లు చెప్పబడుతున్న టీపీబీవో కె. లావణ్య, ఇంజినీరు డి.శ్రీనివాసులు అక్రమ నిర్మాణాలను నివారించడంలో విఫలమైనందుకు, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో తగిన చర్యలు తీసుకోకపోవడం, ఆక్రమణలను అనుమతించడం వల్ల జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం కలిగిందని నిర్ధారించబడిన కారణంగా మూడేళ్ల పాటు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కె.లావణ్య, డి.శ్రీనివాసులు అప్పీలుకు వెళ్లడంతో నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేసి వాటిని ధ్రువీకరించినందు వల్ల స్థానిక సంస్థకు ఆర్థిక నష్టం కలగనందున మొదట విడుదల చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ (సీసీ–ఎ) నిబంధనలు 1991లోని నిబంధన 38 ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాశీవిశ్వనాథుని దర్శించుకున్న ఆశ్రమవాసులు

దాబాగార్డెన్స్: దాతల సహకారంతో స్వామి వివేకానంద సంస్థ ఆశ్రమ వాసులను సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా కాశీ విశ్వనాథుడి దర్శనానికి తీసుకెళ్లారు. ఆశ్రమ వాసులు కాశీ వెళ్లి విశ్వనాథుడిని, అన్నపూర్ణమాత, కాశీ విశాలాక్షిని దర్శించుకున్నట్టు అప్పారావు తెలిపారు. గంగానదిలో పుణ్య స్నానాలు ఆచరించి, కాశీ విశ్వనాథుడిని పూజించినట్లు తెలిపారు.

చేనేత.. చేయూత



చెన్నై హ్యాండ్‌మేడ్ రకం మ్యాట్లు, డోర్‌మ్యాట్లు

- హస్తకళలను ప్రోత్సహించాలని కోరుతున్న కళాకారులు
- 51వ వార్డు వుడా కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్
- కళాకారుల పనితనానికి అద్దం పడుతున్న వివిధ రకాల ఆవిష్కరణలు
- చీరలు, ఆభరణాలు, దుస్తులు, కొండపల్లి బొమ్మల కొనుగోలుకు జనం ఆసక్తి



చీరలు చూస్తున్న మహిళలు

మద్దిపాలెం: దేశంలో ప్రసిద్ధి చెందిన చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు చేనేత హస్తకళా ప్రదర్శనలు (ఎగ్జిబిషన్) ఏర్పాటవుతుంటాయి. ఈ క్రమంలో జీవీఎంసీ 51వ వార్డు వుడా కమ్యూనిటీ హాల్లో ఈ నెల 11న హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. పలు రాష్ట్రా ల నుంచి నేరుగా చేనేత వస్త్రాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన హస్త కళలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

పలు రాష్ట్రాల నుంచి..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల తయారీదారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రదర్శనలో విక్రయిస్తున్నారు. స్వయం ఉపాధి కార్మికులు తాము స్వయంగా తయారు చేసిన హస్తకళలను ప్రోత్సహించాలని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఇంటికి సమీపంలో ఇలాంటి వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లభ్యమయ్యే వస్త్రాలు, వస్తువులు..

చేనేత పట్టు, కాటన్ చుడీదార్లు, టాప్‌లు, డ్రెస్ మెటీరియల్స్, మహిళలకు కలంకారీ, వెంకటగిరి, నారాయణపేట చీరలు, పోచంపల్లి, ఖాదీ, డిజిటల్ ప్రింట్స్, వెంకటగిరి, బెంగాలీ కాటన్, మంగళగిరి, ఉప్పాడ, ఫ్యాన్సీ, మంగళగిరి కాటన్ చీరలు, బెంగాలీ సిల్క్స్, కాంతా వర్క్ కాటన్, భాగల్‌పూరీ సిల్క్, గుజరాత్ డిజైనర్ టాప్స్, లక్నో చికెన్ వర్క్స్, లక్నో నైటీలు, డోర్ కర్టెన్లు, చేతితో తయారు చేసిన (హ్యాండ్‌మేడ్) వివిధ రకాల మ్యాట్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్లు, జైపూర్, రాజస్థాన్ కాటన్ బెడ్‌షీట్లు ఇలా ప్రత్యేక రంగులు, డిజైన్లతో ఇక్కడి సామగ్రి అందరినీ ఆకట్టుకుంటోంది.



ఎగ్జిబిషన్‌లో ఉంచిన హారాలు, వివిధ ఆభరణాలు

మగవారి కోసం కాటన్ షర్టులు, టవల్స్, లుంగీలతో పాటు కొండపల్లి బొమ్మలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, పర్సులు, తమిళనాడు 1 గ్రామ్ గోల్డ్ హారాలు, ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఒకసారి చూస్తే మళ్లీ వెళ్లాలనుకునే విధంగా ఉన్నాయి. ప్రతి ఏడు స్వయంగా తయారు చేసిన వస్తువులు తీసుకొచ్చి విక్రయిస్తారు. కనీసం 15 నుంచి 20 రోజుల వరకు ప్రదర్శన నిర్వహిస్తారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు తక్కువగా ఉన్నాయని విక్రయదారులు చెబుతున్నారు. చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.



ప్రత్యేక ఆకర్షణగా కొండపల్లి బొమ్మలు



కాటన్ టవల్స్, బెడ్‌షీట్ల విక్రయం

ఎర్నిమాంబ ఆలయం హుండీ ఆదాయం రూ. 17.22 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల ఆదాయం లెక్కించారు. 38 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.17,22,154 ఆదాయం వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పైల దివాకర్‌కు తైనాల పరామర్శ



దివాకర్‌ను పరామర్శిస్తున్న తైనాల విజయ్‌కుమార్

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పైల దివాకర్‌ను తాటిచెట్లపాలెంలోని నివాసంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తైనాల విజయ్‌కుమార్ పరామర్శించారు. రెండు నెలలుగా లివర్, జాండిస్ సమస్యలతో బాధపడుతున్న దివాకర్ ఆరోగ్య స్థితిని తైనాల అడిగి తెలుసుకుని, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, హరి పట్నాయక్, నాయుడు, నర్సారావు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘యోగాంధ్ర’పై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న మంత్రి నారాయణ, పుల్లారావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంపై సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు కార్యాలయంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లపై వీరు చర్చించారు. విశాఖ వాసులందరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కూటమి నేతలు నజీర్, ఉషాకిరణ్, సురేష్‌బాబు, జీవీఎంసీ జోనల్ కమీషనర్లు రాము, శివప్రసాద్ పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో యోగా డే ప్రత్యేక కార్యక్రమాలు



యోగా డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ నేతృత్వంలో బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల స్కూల్ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక విద్యార్థులు, రైల్వే ఉద్యోగుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్‌లోని రైల్వే ఉద్యోగుల కోసం ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రైల్వే సిబ్బంది, ఉద్యోగులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఉద్యోగుల కుటుంబాలు కలిసి పలు రైల్వే స్టేషన్లలో యోగా సాధన చేశారు. పిల్లలు, పెద్దలు, ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా మనసు, శరీరాన్ని అదుపులో ఉంచుకోవచ్చని డీఆర్ఎం లలిత్ బోరా ఈ సందర్భంగా తన సందేశంలో తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ ట్రెనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, కటింగ్ అండ్ సుయింగ్, మోటార్ కార్ మెకానిజం, మోటార్ బైక్ మెకానిజం, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మొబైల్ రిపేర్ అండ్ మెయింటినెన్స్ తదితర వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా కోర్సులను బట్టి విద్యార్హత 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వాటిలో మహిళలు, పురుషులకు కోర్సులు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 1 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99633 40611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన అభాగ్యులు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది రైల్వే పోలీసుల సహకారంతో బుధవారం ఎనిమిది మంది నిరాశ్రయులను జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్ హోంకు తరలించారు. దయగాన్, ఒడిశాకు చెందిన ప్రీతీ రాజేశ్వరి, బీహార్‌కు చెందిన సుఖన్, బొబ్బిలికి చెందిన తాబ్బురి సత్యనారాయణ, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన లాకోజీ నారాయణ స్వామి, గుర్లకు చెందిన పెనుబర్తి నాయుడు, కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన రాజు, దువ్వాడకు చెందిన నిర్మల్ సింగ్, బీహార్, బంకాకు చెందిన సంతోష్ కుమార్ శర్మ తదితరులను షెల్టర్‌కు తరలించారు. వీరిలో ఒక్కరు మినహా మిగతా వాళ్ల మానసిక స్థితి సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పెట్టింది తింటూ బతుకుతున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరందరినీ ఫుట్ పాత్‌లు ఖాళీ చేయించి షెల్టర్లకు తరలించినట్లు వాసు తెలిపారు.

కె.కె.రాజుకు ఆత్మీయ సత్కారం



కె.కె.రాజును సత్కరిస్తున్న కె.వి.బాబా, ముస్లిం నాయకులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన కేవీ బాబా, ఇతర ముస్లిం నాయకులు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి పదవి కల్పించిన పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కె.కె.రాజుకు, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు, రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబుకు బాబా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఐ.హెచ్. ఫరూఖి, పార్టీ మైనారిటీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, విశాఖ జిల్లా పెన్షన్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, (అలియాస్ మొహమ్మద్ ఇబ్రహీం), 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, వార్డు కార్యదర్శి బాబ్జి, విశాఖ జిల్లా మైనారిటీ సెల్ సెక్రటరీ నిజాం, సీనియర్ నాయకుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ ఎంపికలు



ఎన్‌సీసీ ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో 11 ఏజేడీ ట్రూప్ కమాండర్, పాఠశాల ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎన్.వి. విశ్వనాథం నేతృత్వంలో బుధవారం ఎన్‌సీసీ 2025–27కు సంబంధించిన ఎంపికలు జరిగాయి. పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు క్యాడెట్లుగా ఎంపికయ్యారు. సుబేదార్ మజర్ జయప్రకాష్, హవల్దార్ శ్యామలరావు, శుక్రరాజ్‌లు విద్యార్థులకు శారీరక పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, 2 ఆంధ్ర బెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, సునీత, గ్లోరీ, పుష్పలత, శ్యామల, రామలక్ష్మి, అప్పారావు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీయూ వైజాగ్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఆర్చి బిషప్ ఉడుముల బాల

దాబాగార్డెన్స్: ఆలిండియా క్యాథలిక్ యూనియన్ విశాఖపట్నం సర్వసభ్య సమావేశం బుధవారం మహారాణిపేట ఆర్‌సీఎం పాస్టరల్ సెంటర్ హాల్లో నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల పాల్గొని పలు సూచనలు చేశారు. సంఘం విశాఖ గౌరవ అధ్యక్షుడు గోన స్వామినాథం మాట్లాడుతూ ఏఐసీయూ విధి విధానాలు, కార్యకలాపాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలు వివరించారు. సంఘం విశాఖ రీజియన్ అధ్యక్షుడు, జాతీయ సహాయ కార్యదర్శి బూర వేలంగిణి రవీంద్ర శేషుబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, సమాజ సేవ, విద్యాభివృద్ధి, పేదలు, అభాగ్యులు, బడుగు వర్గాలను పైకి తీసుకురావడంలోనూ ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, వందేళ్ల పైబడిన సంఘం పురోగతిని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏఐసీయూ సభ్యుడు చిట్టిబాబును ఆర్చి బిషప్ ఉడుముల బాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ ఎం.ప్రతాప్, విశాఖ అర్బన్ డీన్ ఫాదర్ ఎస్.ప్రతాప్, ఏఐసీయూ కార్యదర్శి బేతా జోసెఫ్, కోశాధికారి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. పరవాడ ఆస్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–2పై వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో అవగాహన సదస్సులో సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏఎస్ఆర్ కాలనీ వాసులు

దాబాగార్డెన్స్: ఏఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న 134 నిరుపేద కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ కాలనీ నాయకులు బుధవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఇళ్లు పొందినప్పటికీ తాగునీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చూడాలని ఆ వినతిలో పేర్కొన్నారు. అలాగే చాలా మంది బీపీఎల్ కార్డుదారులు కావడం, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పన్నులు చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారని, అదనపు కమిషనర్ స్పందించి మంచినీటి కుళాయి కనెక్షన్ల విషయాన్ని వాటర్ సరఫరా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పన్నుల సమస్యపై సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కార మార్గాలు సూచిస్తామని హామీ ఇచ్చారని కాలనీ వాసులు తెలిపారు.

మంచినీరు సరఫరా చేయండి

- రోడ్డెక్కిన 38వ వార్డు బుక్కావీధి మహిళలు



నిరసన తెలుపుతున్న బుక్కా వీధి మహిళలు తదితరులు

దాబాగార్డెన్స్: బుక్కా వీధిలో మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిటు నాయకుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబునాయుడు చెబుతున్నారని, తాగునీరే సరఫరా చేయలేని ఈ కూటమి ప్రభుత్వం నగరాన్ని ఏం ఉద్ధరిస్తుందని ప్రశ్నించారు. నెలల తరబడి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నా, జీవీఎంసీ అధికారులకు చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి, నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా బాగు చేయకుండా పాలకులు, జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆరోపించారు. తాగునీటి పైపులైన్ల ద్వారా మురుగు నీరు వచ్చేస్తుందని అనేక సార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా కనీస స్పందన లేదన్నారు. జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటిని తాగి ఈ ప్రాంత వాసులు డయేరియాతో ఆస్పత్రి పాలవుతున్నారని, చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలల కిందట కలెక్టర్‌ని కలిసి సమస్య గురించి మొరపెట్టుకుంటే నెలలో సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. యోగా చేసి గిన్నిస్ బుక్ రికార్డు ఎక్కాలని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు తహతహలాడుతున్నారని, ఇదే నగరంలో మంచినీరు సరిగ్గా ఇవ్వలేని వారు గిన్నిస్ బుక్‌ల కోసం ఆలోచించడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్నాలో చంద్రశేఖర్, సూరాడ లక్ష్మి, సత్యం, రామలక్ష్మి, ఎల్లయ్యమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.